క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన రామ కృష్ణ, షేక్ అప్సర్‌లకు సీఎంఆర్ఎఫ్ మంజూరు కావడంతో అందుకు సంబంధించిన చెక్కులను శుక్రవారం మండల కేంద్రంలో అందజేశారు. మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు శ్రీనివాస్, అన్వర్, యూనిస్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో నందిపేట విద్యార్థుల ప్రతిభ



నందిపేట్(ఆర్మూర్): త్రిదండి చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలో నందిపేట మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనభరిచారు. జిల్లా కేంద్రంలోని ప్రజ్ఞ వికాస్ పాఠశాలలో నిర్వహించిన పోటీలలో నందిపేటలోని నియో లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీవర్ధిని, శ్రీకర్, రిషిత్‌రాజులు అత్యుత్తమ ప్రతిభ కనభరిచి నగదు బహుమతులను అందుకున్నారు. నందిపేటలోని పాఠశాలలో విద్యార్థులను కరస్పాండెంట్ అరుణ్, ప్రిన్సిపాల్ రవికిరణ్, అభినందించారు.

మోడల్ ఎన్నికలు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎన్నికలపై అవగాహన కల్పించడానికి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు శుక్రవారం మోడల్ ఎలక్షన్స్ నిర్వహించారు. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల హెడ్ బాయ్‌గా శ్రీరాం, హెడ్ గర్ల్‌గా రక్షిత ఎన్నికయ్యారు. వీరిని పాఠశాల హెచ్ఎం సురేశ్ కుమార్ అభినందించారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత



నందిపేట్ (ఆర్మూర్): పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు సీఈఐఆర్ యాప్ ద్వారా పట్టుకొని బాధితులకు అందజేశారు. నందిపేట మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన సాయి, కుదువాన్పూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌లు రెండు నెలల క్రితం తమ సెల్ ఫోన్లను పోగొట్టుకున్నట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టి సీఈఐఆర్ ద్వారా రికవరీ చేశారు. శుక్రవారం బాధితులకు నందిపేట ఎస్సై హరిబాబు సెల్ ఫోన్లను అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీకి ఎంపిక



డి.మహతి

వేల్పూర్: మండల కేంద్రంలోని అక్షర స్కూలు విద్యార్థిని డి.మహతి రాష్ట్రస్థాయి ప్రజ్ఞా వికాస్ పోటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పురుషోత్తం శుక్రవారం తెలిపారు. శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి సహకారంతో ఇటీవల నిర్వహించిన ప్రజ్ఞావికాస్ వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరచి జిల్లాస్థాయిలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. వచ్చేనెల 2న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటుందని ఆయన పేర్కొన్నారు.

స్వాగత తోరణం నిర్మాణానికి భూమిపూజ



వేల్పూర్: మండల కేంద్రంలో పెద్దమ్మ ఆలయం స్వాగత తోరణం నిర్మాణానికి డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ముదిరాజ్‌ల కోరిక మేరకు విరాళంగా స్వాగత తోరణాన్ని నిర్మించి ఇవ్వనున్నట్లు రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు.

బీడీ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



వేల్పూర్: బీడీ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.4 వేల జీవనభృతి చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం 500 మంది బీడీ కార్మికులతో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ ఆఫీసు ఎదుట ఆందోళన నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సంతోష్‌కు అందజేశారు. ఐఎఫ్‌టీయూ నాయకులు అరవింద్, సత్తెమ్మ, రాజేశ్వర్, నజీర్, రూపేశ్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

కంకర వేసి వదిలేశారు

- ముందుకు సాగని జోర్‌పూర్– మచ్చర్ల లింక్ రోడ్డు పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



జోర్‌పూర్ నుంచి మచ్చర్ల వరకు కంకర వేసి వదిలివేసిన లింక్ రోడ్డు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలోని జోర్‌పూర్ నుంచి ఆర్మూర్ మండలం మచ్చర్ల వరకు చేపట్టిన లింక్ రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిలిచిన పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. రోడ్డుకు కంకర వేసి తారును వేయడం మరిచిపోవడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పనులు పూర్తవుతాయో లేదనని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రూ. 3.15 కోట్ల నిధులు మంజూరు..

ప్రభుత్వం గత మార్చి నెలలో రూ.3.15 కోట్ల నిధులను కేటాయించి 3.2 కిలో మీటర్ల వరకు లింక్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల నందిపేట నుంచి మచ్చర్ల మీదుగా ఆర్మూర్ వెళ్లే ప్రయాణికులకు 8 కిలో మీటర్ల దూరం తగ్గుతుంది. అలాగే చుట్టు పక్కల గ్రామాల వారు నేరుగా మచ్చర్ల గ్రామానికి చేరుకోవచ్చని ప్రజలు సంతోషించారు. కానీ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. మండలంలో అన్ని లింక్ రోడ్డు పనులు పూర్తయినా ప్రధానమైన జోర్‌పూర్, మచ్చర్ల రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

జోర్‌పూర్ నుంచి మచ్చర్ల గ్రామం వరకు చేపట్టిన లింక్ రోడ్డు పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. దూరం తగ్గి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే రోడ్డును తొందరగా పూర్తి చేయడం వల్ల వేలాది మంది ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– ప్రవీణ్‌గౌడ్, కుద్వాన్‌పూర్, నందిపేట

చర్యలు తీసుకుంటాం

జోర్‌పూర్ నుంచి మచ్చర్ల గ్రామం వరకు జరుగుతున్న లింక్ రోడ్డు పనులు తిరిగి ప్రారంభిస్తాం. నాణ్యతా ప్రమాణాలు పాటించి సెప్టెంబర్ నెలాఖరు వరకు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. చిన్న చిన్న ఇబ్బందుల వల్ల కాస్త ఆలస్యమైంది.

– కిషన్, పంచాయతీరాజ్ డీఈ, ఆర్మూర్

కొనసాగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన

- కుటుంబ నిర్ధారణ కోసం యాప్‌లో వివరాల నమోదు



దరఖాస్తులను తీసుకుంటున్న ఏఈవో మౌనిక

డొంకేశ్వర్(ఆర్మూర్): రేషన్‌కార్డు లేక, వివరాలు సరిపోలక రుణమాఫీ నిలిచిపోయిన రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేయిస్తోంది. ఏఈవోలు, ఎంఏవోలు రోజుకో గ్రామానికి వెళ్లి రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. రుణమాఫీకి అర్హత ఉండి రేషన్‌కార్డు లేని రైతులు జిల్లాలో 34వేల మంది ఉన్నారు. వీరికి కుటుంబ నిర్ధారణ చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రైతు భరోసా అనే యాప్‌ను ఇచ్చింది. వ్యవసాయాధికారులు గ్రామాలకు వెళ్లి రైతు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకుని వారి ఫోటోలు, వివరాలను నమోదు చేస్తున్నారు. ఆగస్టు 10 వరకు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు ఇవ్వగా ఇప్పటి వరకు 3,500 మందికి కుటుంబ నిర్ధారణ జరిగింది. యాప్‌లో వివరాలను నమోదు చేసే సమయంలో అప్పుడప్పుడు సాంకేతిక సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో నమోదు ఆలస్యం అవుతోంది.

2న బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో స్పాట్ కౌన్సెలింగ్

రుద్రూర్: అక్బర్‌నగర్ శివారులో గల ఆహార శాస్త్ర సాంకేతిక కళాశాలలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ)లో సెప్టెంబర్ 2న కన్వీనర్ కోటాలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యాపకులు తెలిపారు. బీసీ–బి, బీసీ–డి , ఎస్సీ , ఎస్టీ విభాగాల్లో మొత్తం నాలుగు సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 2024లో నిర్వహించిన ఎంపీసీ స్ట్రీమ్ కింద టీజీఎఫ్ సెట్లో అర్హత సాధించినా.. లేదా ఎంపీసీ విభాగంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైనా దీనికి అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉదయం పది గంటలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ సందర్శించాలన్నారు.

డిగ్రీ కళాశాలకు బస్సు సౌకర్యం కల్పించండి



ఆర్టీసీ డిపో మేనేజర్ రవి కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఆర్మూర్: పట్టణ శివారులోని పిప్రి రోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లడానికి విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ఆర్మూర్ డిపో మేనేజర్ రవి కుమార్‌కు కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రేమ్ కుమార్, నాయకులు ఆత్మ గౌరవ్, మురళి, మహిపాల్ తదితరులున్నారు.



ఆర్మూర్ పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్లో వంటలను పరిశీలిస్తున్న డీఎస్పీ నేతలు

నాణ్యమైన భోజనాన్ని అందించండి

ఆర్మూర్: బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, హాస్టల్ వార్డెన్‌ను కోరారు. ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్ కాలనీలో గల బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్‌ను ధర్మ సమాజ్ పార్టీ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వంటశాల, భోజన సౌకర్యాలను పరిశీలించారు.

నిర్లక్ష్యం కారణంగానే రుణమాఫీ కాలేదు



వర్ని: సహకార సంఘం ఉద్యోగుల తప్పిదం మూలంగానే రుణమాఫీ రాలేదని ఆరోపిస్తూ వర్ని మండలం హుమ్నాపూర్ సహకార సంఘం ఎదుట రైతులు, సొసైటీ సభ్యులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ధర్నా నిర్వహించి కార్యదర్శి, సిబ్బందిని నిలదీశారు. రుణమాఫీకి అర్హులైన రైతుల పేర్లు నమోదు చేయడంలో ఇతర వివరాలు ఆన్లైన్లో నమోదు చేయడంలో తప్పులు జరగడం వల్ల తమకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

పట్టుదలతో డాక్టరేట్ సాధించడం అభినందనీయం



వినీతను అభినందిస్తున్న అల్జాపూర్ శ్రీనివాస్

పెర్కిట్(ఆర్మూర్): రాజకీయ రంగంలో ఒడిదొడుకులను తట్టుకుని పట్టుదలతో విజ్ఞాన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అవార్డు అందుకున్న ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పండిత్ వినీత కృషి స్ఫూర్తిదాయకమని క్షత్రియ విద్యా సంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం డాక్టరేట్ అవార్డు గ్రహీత పండిత్ వినీతను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న పండిత్ వినీత రాజకీయ రంగంలో రాణిస్తూనే డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అల్జాపూర్ లక్ష్మీ నారాయణ, అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపల్ ఆర్‌కే పాండే, హెచ్‌ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

నందిపేట్(ఆర్మూర్): ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు శుక్రవారం నందిపేట మండల కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ. 10 లక్షలు ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేలు, బీడీ కార్మికులకు రూ.4 వేల పింఛను ఇవ్వాలన్నారు. నేతలు చిన్నమల్లయ్య, రాజలింగం, అనంతరావు, దేవయ్య, లత పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

■ ఘనంగా బారెడి పోచమ్మ పండుగ



వర్ని(చందూర్): చందూర్ మండల కేంద్రంలో శుక్రవారం బారెడి పోచమ్మ పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. రామాలయం నుండి పోచమ్మ ఆలయం వరకు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. చందూర్ సహకార సంఘం అధ్యక్షుడు ప్యారం అశోక్, మాజీ జెడ్పీటీసీ అంబర్ సింగ్, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఉన్నారు.

■ విఠలేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

రుద్రూర్: మండల కేంద్రంలోని పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాస ద్వాదశి పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు పత్తి లక్ష్మణ్, ప్రతిమ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.



■ రుక్మిణి ఆలయంలో ..

మాక్లూర్: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని రుక్మిణీ పాండు రంగ ఆలయంలో మహిళలు పెద్ద ఎత్తున కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్: ఉచిత ఫిజియోథెరపీ శిక్షణ సేవల ప్రాధాన్యతను గుర్తించి వైకల్యంతో బాధపడే పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ మండల విద్యాధికారి రాజగంగారాం సూచించారు. ఆర్మూర్ భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఫిజియోథెరపీ వైద్యురాలు రేణుక.. చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్సను అందించారు. ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్ కిషన్, సురేష్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు పాల్గొన్నారు.

అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి

రుద్రూర్: గ్రామాల్లో ఓటరు జాబితా సవరణ, మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదు సంబంధించి సర్వే ప్రారంభమైనట్లు పోతంగల్ తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికి వచ్చి ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారని, తప్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. 2025, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. పోతంగల్‌లో కొనసాగుతున్న సర్వేను ఆర్ఐ సాయిలు పరిశీలించి బీఎల్‌వోలకు సూచనలు చేశారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

రెంజల్(బోధన్): పండుగలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం సాటాపూర్ రైతు వేదికలో శాంతికమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వినాయక మండపాలను ఏర్పాటు చేసుకునే వ్యక్తులు, యువజన సంఘాలు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముందుగా ఠాణాలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ రాజలింగం, రెంజల్ ఎస్సై సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై విచారణ ప్రారంభం

మాక్లూర్: రుణమాఫీ కాని రైతులు, వారి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించేందుకు శుక్రవారం అధికారులు మాణిక్‌బండార్ గ్రామంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుసేన్ హాజరయ్యారు. వ్యవసాయ అధికారులు చేపట్టిన ఇంటింటి కార్యక్రమాన్ని పరిశీలించారు. రుణమాఫీలో జరిగిన అవకతవకలను గుర్తించి రైతులకు న్యాయం చేయాలని మండల వ్యవసాయ అధికారులను ఆయన ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారి పద్మ ఇతర సిబ్బంది ఉన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్ పెట్టొచ్చు



కోనసముందర్‌లో డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్



మామిడిపల్లిలో తొట్టెల నుంచి నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

కమ్మర్‌పల్లి: పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టొచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం చౌట్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని కోనసముందర్‌లో పర్యటించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. జ్వరం వచ్చిన వెంటనే అశ్రద్ధ చేయకుండా దగ్గర్లో ఉన్న పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. చౌట్‌పల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

బోధన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఇన్‌చార్జి డీఎల్పీవో మధుకర్ సూచించారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామ పంచాయతి ఆఫీస్‌ను సందర్శించారు. ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని సూచించారు. ఎంపీవో మన్మోహన్ శర్మ ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి, పెర్కిట్ గ్రామాల్లో శుక్రవారం వైద్యాధికారులు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్‌పేట్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస మాట్లాడుతూ.. ఇంటితో పాటు పరిసరాల్లో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. వర్షపు నీటిలో లార్వా వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధుల ప్రబలుతాయన్నారు.

వేల్పూర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు రాకుండా నివారించవచ్చని వేల్పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి శరత్‌చంద్ర సూచించారు. మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. సీహెచ్‌వో నారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిలువ నీటిని తొలగించాలి

ఆర్మూర్: ఇంటి పరిసరాల్లో నిలువ ఉన్న నీటిని తొలగించడం ద్వారా దోమలను తద్వారా సీజనల్ వ్యాధులను నియంత్రించవచ్చని ఆర్మూర్ పట్టణ వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని పలు కాలనీలలో ఫ్రైడే డ్రైడేను ఆరోగ్య శాఖ అధికారులు శుక్రవారం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఫెర్దుస్ ఫాతిమా, సూపర్‌వైజర్ శాంత, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్ బట్టు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌లో సమస్య పరిష్కారం

బోధన్‌టౌన్: పట్టణంలోని కమ్యూనిటీ మీడియేషన్ కేంద్రంలో శుక్రవారం ఓ కుటుంబ సమస్యను పరిష్కరించారు. గురువారం బోధన్‌లో కమ్యూనిటీ మీడియేషన్ ప్రారంభోత్సవంలో పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్ ఒకరు వచ్చి తన సమస్యను జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాలకు వివరించారు. సీనియర్ సిటిజన్ రాత పూర్వకంగా తనకున్న సమస్యను రాసి ఇచ్చారని కమ్యూనిటీ మీడియేషన్ కౌన్సిలర్లు పద్మాసింగ్, సుజాత తెలిపారు. శుక్రవారం సమస్యతో వచ్చిన సీనియర్ సిటిజన్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను పిలిచి ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి సమస్యను పరిష్కరించినట్లు లీగల్ సెల్ సర్వీసెస్ బోధన కమిటీ చైర్మన్ న్యాయమూర్తి రవికుమార్ తెలిపారు. అనంతరం వారికి అవార్డును అందించారు. ప్రజలు ఈ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సభ్యత్వ నమోదును జయప్రదం చేయండి



నందిపేటలో మాట్లాడుతున్న బద్దం లింగారెడ్డి

నందిపేట్ (ఆర్మూర్): పార్టీ సభ్యత్వ నమోదులో ప్రతీ కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు బద్దం లింగారెడ్డి కోరారు. మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు భూతం సాయిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా బద్దం లింగారెడ్డి మాట్లాడుతూ.. నందిపేట్ మండలంలో 12 వేల సభ్యత్వ నమోదు నిర్వహించాలని సూచించారు. సభ్యత్వ నమోదు ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జి గంగోని సంతోష్, బీజేపీ నేతలుసూది సాయికుమార్, పటేల్ రాజు, సభ్యత్వ నమోదు మండల ఇంచార్జ్ నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): సెప్టెంబరులో ప్రారంభమయ్యే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంపై కార్యశాల నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వరకు పార్టీని పటిష్టం చేయడానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలన్నారు. బూత్‌కు 200లకు తగ్గకుండా సభ్యత్వాలను నమోదు చేయించాలన్నారు. సభ్యత్వ నమోదు ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ గంగోనే సంతోష్, బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు కొత్తూరు గిరీష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాదగిరి, నాయకులు సుర శ్రీకాంత్, హరీష్, లోక రాంరెడ్డి పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	డిమోంటి కాలనీ (తెలుగు) - 10.00. 7.35. మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) - 1.05. తంగలాన్ (తెలుగు) 4.15. స్త్రీట్–2 (హిందీ) 10.40
స్క్రీన్-2 –	సరిపోదా శనివారం (తెలుగు)- 11.30. 3.00. 6.00. 10.00
స్క్రీన్-3 –	ఆయ్ (తెలుగు) - 12.05. కమిటీ కుర్రోళ్లు (తెలుగు) - 3.10. 9.30
స్క్రీన్-4 –	సరిపోదా శనివారం (తెలుగు)- 11.00. 2.30. 6.00. 9.30

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతాఏషియన్) నిజామాబాద్

స్క్రీన్-1	ఆయ్ (తెలుగు) - 10.20. 4.20. 10.30 తంగలాన్ (తెలుగు) 1.20. 7.20
స్క్రీన్-2	డిమోంటి కాలనీ–2 (తెలుగు) - 10.25. 10.20. స్త్రీట్–2 (హిందీ) - 1.30. కమిటీ కుర్రోళ్లు (తెలుగు)-4.30 మారుతీనగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) - 7.30
స్క్రీన్-3	స్త్రీట్–2 (హిందీ) - 10.20. 10.20. మారుతీనగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) - 1.20. డిమోంటి కాలనీ–2 (తెలుగు) - 4.20. డబుల్ ఇస్మార్ట్ (తెలుగు) 7.10

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్) నిజామాబాద్

స్క్రీన్-1	స్త్రీట్–2 (హిందీ) -10.00. 4.30. 10.50. కమిటీ కుర్రోళ్లు (తెలుగు) - 1.15. 7.45
స్క్రీన్-2	ఏలియన్ రోములస్ (తెలుగు) - 10.15. ఆయ్ - 1.00. తంగలాన్ - 4.05. స్త్రీట్ -2 (హిందీ) - 7.25. మారుతీనగర్ సుబ్రహ్మణ్యం - 10.40
స్క్రీన్-3	డిమోంటి కాలనీ–2 (తెలుగు) - 10.20. 4.40. 10.30. స్త్రీట్–2 (హిందీ) - 1.25. ఏలియన్ రోములస్ (ఇంగ్లీష్) - 7.45
స్క్రీన్ -4	వెడింగ్ డైరీస్ (తెలుగు)-10.55. మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) - 1.35. 7.40. రేవు (తెలుగు)-4.45. ఇంద్ర (తెలుగు) - 10.50
దేవి	తంగలాన్ (తెలుగు)
నటరాజ్	కమిటీ కుర్రోళ్లు (తెలుగు)
విజయ్	మిస్టర్ బచ్చన్ (తెలుగు)
లలితామహల్	డబుల్‌ఇస్మార్ట్ (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,600	వెండి (కిలో)	90,500
22 క్యారెట్స్	68,635		

– నిజామాబాద్ బిజినెస్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899